తిరుపతి జిల్లా

సజావుగా ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియ: డీఎస్పీ



శ్రీకాళహస్తి, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): స్థానిక సంస్థలకు సంబంధించిన ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా సాగిందని డిఎస్పి పావని విలేకరులతో తెలిపారు. అదేవిధంగా నామినేషన్ వేసే వ్యక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు వేసేలా రక్షణ కల్పించామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు పోలింగ్ ముగిసేంత వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన పోలీసు సిబ్బందికి, ఎన్నికల అధికారులకు, ప్రజలకు, మీడియా మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పూడి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా అద్దూరు అంకమ్మ నామినేషన్



తొట్టంబేడు,అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మండలంలోని పూడి ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అద్దూరు అంకమ్మ ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు. పూడి సెగ్మెంట్ మహిళా రిజర్వ్ స్థానానికి టీడీపీ తరపున అద్దూరు అంకమ్మ గురువారం మండల కార్యాలయంలో ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు అద్దూరు సురేష్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ, కట్టుబాటు, విధేయతలకు నిదర్శనమని, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఇచ్చే పార్టీ టీడీపీ మాత్రమే అని అన్నారు. గత ఎన్నికలలో కూడా బూత్ స్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశారని, ఆ నిబద్ధతకు ప్రతిఫలంగానే నేడు టీడీపీ తరపున నామినేషన్ వేసే అవకాశం దక్కిందని తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, సామాన్య కార్యకర్త కుటుంబాలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగుతోందని ఆయన పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అద్దూరు అంకమ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

పారదర్శకంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ ప్రక్రియ

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్



శ్రీకాళహస్తి,అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ ప్రక్రియను కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిలు సూచనల మేరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరిగింది. అదే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారి అనుచరులు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను దౌర్జన్యంగా ఏకగ్రీవం చేసుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని 64 ఎంపీటీసీలు, 4 జడ్పీటీసీలు, 130 పంచాయతీలను బెదిరింపులకు గురిచేసి ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శించారు. ఈసారి మాత్రం కూటమి ప్రభుత్వంలో ప్రశాంత వాతావరణంలో వైసీపీ నాయకులు కూడా 4 మండలాల్లో నామినేషన్లు వేశారని, ఇదే ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు. కూటమి ప్రభుత్వం రౌడీయిజం చేసే వ్యక్తులకు భయపడదని, స్పష్టం చేశారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన పోలీసు, రెవెన్యూ, మీడియా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, రవీంద్రనాథ్ రెడ్డి, కామేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ అభ్యర్థిగా గురవయ్య నామినేషన్



శ్రీకాళహస్తి, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): తొట్టంబేడు జడ్పీటీసీ సీపీఎం అభ్యర్థిగా పెనగడం గురవయ్య శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తిరుపతి డీఆర్డీఏ కార్యాలయంలో సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, తిరుపతి నగర కార్యదర్శి వేణుతో కలిసి రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలను అందజేయడం జరిగింది. ప్రజల తరపున పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలనీ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని గురవయ్య పిలుపునిచ్చారు.

సీడీఎస్ఎల్ రీఇమేజిన్ ఐడియాథాన్ 2.0 ప్రారంభం

- ఇన్వెస్టర్ అవగాహన భవిష్యత్తును తీర్చిదిద్దడానికి విద్యార్థులకు ఆహ్వానం

తిరుపతి, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): వరల్డ్ ఇన్వెస్టర్ వీక్ 2026 సందర్భంగా సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ రీఇమేజిన్ ఐడియాథాన్ 2.0ను ఘనంగా ప్రారంభించింది. ఆర్థిక అవగాహన, సైబర్ భద్రతను బలోపేతం చేసే వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సిందిగా భారతదేశం అంతటా ఉన్న విద్యార్థులను ఈ వేదిక ఆహ్వానిస్తోంది. డిజిటల్ మారుతున్న ఇన్వెస్టర్లకు తగినట్లుగా సేవలను అందించడం దీని ప్రధాన ఉద్దేశం. భారతదేశంలో 'సమాజ్ సే ఇన్వెస్టింగ్ సింపుల్' థీమ్‌తో కొనసాగుతున్న ఈ కార్యక్రమం.. సెబీ చేపట్టిన 'ప్రాజెక్ట్ జాగరూక్' ఇన్వెస్టర్ అవగాహన, విద్య లక్ష్యాలకు సంపూర్ణంగా తోడ్పడుతుంది. ఆర్థిక అక్షరాస్యతను పెంచడానికి, సమాచారంతో కూడిన పెట్టుబడి విధానాలను ప్రోత్సహించడానికి, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించడానికి సెబీతో పాటు సీడీఎస్ఎల్ వంటి సెక్యూరిటీస్ మార్కెట్ భాగస్వాములు ఇందులో కలిసి పనిచేస్తున్నాయి. అవగాహన ఉన్న ఇన్వెస్టరే శక్తివంతమైన ఇన్వెస్టర్ అనే భావనతో కార్యక్రమం రూపుదిద్దుకుంది. సీడీఎస్ఎల్ ఎండీ, సీఈఓ నేహాల్ వోరా మాట్లాడుతూ.. ఇన్వెస్టర్లు తమంతట తాముగా సమాచారాన్ని అంచనా వేసి, సరైన నిర్ణయాలు తీసుకోగలగాలని పేర్కొన్నారు. యువతకు కూడా ఈ అవగాహనను చేరవేయడానికి అమర్ చిత్ర కథతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, విద్యార్థులలో ఆర్థిక అక్షరాస్యతను పెంచే సెబీ 'మస్ట్' కార్యక్రమానికి కూడా ఈ ఐడియాథాన్ తోడ్పాటునందిస్తుంది. పాల్గొనే విద్యార్థులు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్‌లు, చాట్‌బాట్‌లు, గేమ్‌లు, సిమ్యులేషన్‌లు, లెర్నింగ్ మోడ్యూల్స్, అవగాహన ప్రచారాలు లేదా ఏఐ–ఎనేబుల్డ్ అసిస్టెంట్ల రూపంలో తమ ఆలోచనలను సమర్పించవచ్చు. ఆవిష్కరణ, యూజర్ అనుభవం, ప్రభావం, అమలు సాధ్యత, డేటా రక్షణ వంటి అంశాల ఆధారంగా నిపుణుల జ్యూరీ వీటిని పరిశీలిస్తుంది. టీసీఎస్ మాజీ సీఈఓ, కర్మయోగి భారత్ చైర్‌పర్సన్ ఎస్. రామదొరై ఈ జ్యూరీకి అధ్యక్షత వహిస్తారు. అక్టోబర్ 7 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ ఐదు టీమ్‌లకు మొత్తం రూ.11.5 లక్షల ప్రైజ్ పూల్ అందజేస్తారు. గతంలో మొదటి రీఇమేజిన్ ఐడియాథాన్‌కు భారీ స్పందన లభించగా, ఇప్పుడు దాని విజయంతో ఈ రెండో విడతను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నారు.



శ్రీసిటీని సందర్శించిన తిరుచ్చి ఎన్ఐటీ బృందం

శ్రీసిటీ/వరదయ్యపాలెం, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): తిరుచిరాపల్లి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) డైరెక్టర్ డాక్టర్ జి.అఖిలా శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. ఆమెతో పాటు రిజిస్ట్రార్, డీన్లు, ప్రొఫెసర్లు, ఇతర ఉన్నతాధికారులు పర్యటనలో పాల్గొన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ బృందానికి సాదర స్వాగతం పలికారు. తాను చదువుకున్న ఎన్ఐటీ తిరుచిరాపల్లి నుంచి ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థిగా కళాశాల మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు పరిశ్రమల్లో ప్రత్యక్ష అనుభవం కల్పించడంలో విద్యాసంస్థలు--పరిశ్రమల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను ప్రతినిధి బృందానికి వివరించారు. శ్రీసిటీ త్రీడీ నమూనా, వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలు, ఇక్కడ తయారవుతున్న ఉత్పత్తులను ప్రదర్శించారు. ఐఐఐటీ, క్రియా యూనివర్సిటీ, శ్రీసిటీ ఇంటర్నేషనల్ స్కూల్ వంటి ప్రముఖ విద్యాసంస్థల ఉనికిని వివరిస్తూ, పరిశ్రమలతో పాటు విద్యారంగానికి కూడా శ్రీసిటీ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదుగుతోందని వివరించారు. అనంతరం ప్రతినిధి బృందం శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్స్టామ్, డేనియెలీ, పానాసోనిక్, థెర్మాక్స్ పరిశ్రమలను సందర్శించారు. పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రక్రియలు, ఆధునిక తయారీ విధానాలు, పారిశ్రామిక సామర్థ్యాలను పరిశీలించారు. ఈ పర్యటనపై డాక్టర్ అఖిలా మాట్లాడుతూ, శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, ఆధునిక పరిశ్రమల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో శ్రీసిటీతో కలిసి పనిచేసేందుకు తమ సంస్థ ఆసక్తిగా ఉందని తెలిపారు. ఈ పర్యటన ఎన్ఐటీ తిరుచిరాపల్లి, శ్రీసిటీ మధ్య సంస్థాగత సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్తులో ఉమ్మడి పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి కొత్త అవకాశాలను అన్వేషించేందుకు వేదికగా నిలిచింది.

ప్రజల గుండెల్లో చెరగని స్థానం

- మూడున్నర దశాబ్దాలుగా ప్రజాసేవ చేస్తున్న తంబిరెడ్డి కుటుంబం



నాయుడుపేట,అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ప్రజలకు ఏ కష్టం వచ్చినా నా ఇంటి తలుపు తట్టవచ్చు. సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేయడమే నా లక్ష్యం" అని నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తంబిరెడ్డిపాల్గొన్నారు. పేర్కొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుమారులు తంబిరెడ్డి హేమకుమార్‌రెడ్డి, తంబిరెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల మద్దతు కోరారు. రాజేశ్వరమ్మ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. పెద్దలు ఆశీస్సులు అందుకుని, మహిళలతో ముచ్చటించారు. స్థానిక మహిళలు ఆమెకు హారతులతో స్వాగతం పలికారు. ప్రజల అవసరాలను తెలుసుకుంటూ, తనతోపాటు 5వ వార్డు వైకాపా కౌన్సిలర్ అభ్యర్థి తిపలపూడి నాగరత్నంను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న నాయకులు తంబిరెడ్డి కుటుంబ ప్రజాసేవా నేపథ్యాన్ని వివరించారు. సుమారు 35 సంవత్సరాలుగా జనార్దన్‌రెడ్డి కుటుంబం ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తోందని పేర్కొన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి రాజకీయ అనుభవం, స్థానిక ప్రజలతో ఉన్న పరిచయాలు రాజేశ్వరమ్మకు బలమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆ అనుబంధాన్ని కొనసాగిస్తూ హేమకుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ప్రజలను కలుస్తున్నారని తెలిపారు. ఆకుటుంబ నేపథ్యాన్ని వివరిస్తూనే, మున్సిపల్ పాలన ద్వారా మరింత విస్తృతంగా ప్రజలకు సేవ చేసేందుకు రాజేశ్వరమ్మకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాజేశ్వరమ్మ మాట్లాడుతూ, నాయుడుపేట అభివృద్ధిలో ప్రతి వార్డు అవసరాలకు ప్రాధాన్యం ఉండాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనతోపాటు తిపలపూడి నాగరత్నంను గెలిపించాలని రాజేశ్వరమ్మ కోరారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2026

- రూ.5,217 కోట్ల విలువైన 23 అవగాహన ఒప్పందాలు

అనంతపురం, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): నగరంలోని జేఎన్టీయూలో ఉన్న ఎన్టీఆర్ ఆడిటోరియంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్–2026 రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (ఆహార శుద్ధి) చిరంజీవ్ చౌదరి, (రిటైర్డ్), ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ సగిలి షన్మోహన్. ఐఏఎస్, ఏపీఐఐసీ విసి, ఎండి ఎఎస్.దినేష్ కుమార్, ఉద్యానవన, పట్టు పరిశ్రమల సంచాలకులు డాక్టర్ కె.శ్రీనివాసులు, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభమ్ బన్సల్, అనంతపురం జేఎన్టీయూ విసి ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, సిఐఐ ఆంధ్రప్రదేశ్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రవణ్ షిప్పింగ్ లిమిటెడ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి.సాంబశివరావు, ఎపిఎంఎస్ఎంఈడిసి సిఈఓ విశ్వ మనోహరన్, అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, తదితరులు హాజరయ్యారు. 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముందు, అనంతపురము ప్రాంతీయ సదస్సు ఆటో విడిభాగాల నుండి ఏరోస్పేస్ వరకు రూ.5,217 కోట్ల విలువైన 23 అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. నాలుగు ప్రాంతీయ సమావేశాలు 2026, రూ.73,830 కోట్ల విలువైన 128 అవగాహన ఒప్పందాలు: రాయలసీమ తయారీ కారిడార్, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కోసం పరిశ్రమ తన వాదనను జేఎన్టీయూ అనంతపురంలో వినడం జరిగింది. 2026 నవంబర్ 12, 13 తేదీలలో ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో "నూతన ప్రపంచ క్రమాన్ని నడిపించడం: వాణిజ్యం, సాంకేతికత, విశ్వాసం మరియు ఆలోచనా నాయకత్వం" అనే ఇతివృత్తంతో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు 2026కు ఆతిథ్యం ఇవ్వనుంది. దీనికి సన్నాహకంగా, ఐదు ప్రాంతీయ సమావేశాలు 2026 పెట్టుబడిదారులను రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి తీసుకువెళ్తున్నాయి. అనంతపురము, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల మరియు వైఎస్ఆర్ కడప జిల్లాల కోసం రీజనల్ కాన్ఫరెన్స్ నాలుగవ సమావేశం ఈరోజు అనంతపురములోని జేఎన్టీయూ జరిగింది. ఇందులో రూ.5,217.39 కోట్ల విలువైన 23 అవగాహన ఒప్పందాలను పరస్పరం మార్చుకున్నారు. వీటి ద్వారా 7,613 ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉంది. వీటిలో రూ. 4,141.39 కోట్ల విలువైన 14 ఒప్పందాలు. ఈ ప్రాంతంలోని సొంత జిల్లాల్లోని ప్రాజెక్టులకు సంబంధించినవి. మిగిలిన 9 ఒప్పందాలు అనకాపల్లి నుండి చిత్తూరు వరకు ఉన్న మరో ఏడు జిల్లాలకు సంబంధించినవి ఉన్నాయి. విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, అనంతపురం లలో జరిగిన ప్రాంతీయ సమావేశాలు 2026 కలిసి రూ. 73,829.74 కోట్ల విలువైన 128 అవగాహన ఒప్పందాలకు దారితీశాయి, వీటి ద్వారా 1,35,362 ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉంది.

నల్లచెరువు మండలంలో వైసీపీకి షాక్

- టీడీపీలోకి కీలక నాయకులు

నల్లచెరువు, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): నల్లచెరువు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. మండలానికి చెందిన పలువురు కీలక నాయకులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరగా, ఎమ్మెల్యే వారికి సాదరంగా స్వాగతం పలికారు. నల్లచెరువు మాజీ ఎంపీపీ రమణారెడ్డి, జడ్పీటీసీ భర్త బసిరెడ్డి విశ్వనాథరెడ్డి, ఉబి జర్ల మాజీ సర్పంచ్ కుమారుడు సమీవుల్లా, తవళంమర్రి మాజీ సర్పంచ్ సుధాకర్, తవళంమర్రి మాజీ ఎంపీటీసీ లక్ష్మీపతి యాదవ్, నల్లచెరువు సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ జయచంద్రారెడ్డితో పాటు నాయకులు అంజనప్ప నాయక్, చంద్ర నాయక్, మహదేవ మోహన్ రెడ్డి, మహదేవ రెడ్డి తదితరులు టీడీపీలో చేరారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై, కదిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేస్తున్న కృషిపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. టీడీపీని మండల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నూతనంగా పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్‌తో పాటు మండల కమిటీ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు



పుత్తూరు, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో కార్యాలయం వద్ద అభ్యర్థులు, వారి అనుచరులు, రాజకీయ పార్టీల నాయకుల రాకపోకలు ఉండే అవకాశం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింది. అర్బన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి ఎంపీడీవో కార్యాలయం వద్ద బందోబస్తు విధులు నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా, అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో తమ నామినేషన్లను దాఖలు చేసుకునేలా పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారు.

సత్యవేడు జడ్పిటిసికి టిడిపి తరపున వెట్టి మంజుల నామినేషన్



సత్యవేడు, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి): సత్యవేడు మండలం వానెల్లూరు గ్రామానికి చెందిన టిడిపి కో క్లస్టర్ ఇంచార్జ్, మండల నాయకులు వెట్టి దేవిడ్ రాజ్ మాతృమూర్తి వెట్టి మంజుల జడ్పిటిసి స్థానానికి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ దాఖలు ప్రక్రియ ఊపందుకోవడంతో తిరుపతి జిల్లా కలెక్టరేట్లో జడ్పీ కార్యాలయ నామినేషన్ కేంద్రంలో జడ్పిటిసిగా వెట్టి మంజుల టిడిపి పక్షాన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జడ్పిటిసి స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన మంజుల కుమారుడు దేవిడ్ రాజ్ టిడిపి పార్టీలో చురుకైన పాత్ర నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం సత్యవేడు జడ్పిటిసి స్థానాన్ని ఎస్సీ మహిళా కేటగిరికి కేటాయించడంతో దీనిపై దేవిడ్ రాజ్ కన్ను పడింది. ఈ నేపథ్యంలో జడ్పిటిసి స్థానానికి పోటీ చేయాలని ఉద్దేశంతో దేవిడ్ రాజ్ తన మాతృమూర్తిని మంజులను బరిలో దింపడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జడ్పిటిసి టికెట్ కోసం గాడ్ ఫాదర్ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఫారం జి

బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోసం ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం

(భారత దివాలా మరియు బ్యాంక్రప్సీ బోర్డు (కార్పొరేట్ వ్యక్తుల కోసం దివాలా పరిష్కార ప్రక్రియ) నిబంధనలు, 2016లోని నిబంధన 36A యొక్క ఉప-నిబంధన (1) ప్రకారం)

సంబంధిత వివరాలు		
1	కార్పొరేట్ రుణగ్రహీత పేరు, పాన్ & సిఐఎన్/ ఎల్ఎల్‌పి నంబర్‌తో పాటు.	బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ PAN: AADCM5940P CIN: U68200AP1992PTC013774
2	నమోదిత కార్యాలయ చిరునామా	ఇంటి నం. 1-81, గణపతి నివాస్ శ్రీనివాస నగర్, NCS రోడ్, విజయనగరం, ఆంధ్రప్రదేశ్, భారతదేశం - 535001
3	వెబ్‌సైట్ యొక్క URL	అందుబాటులో లేదు
4	అధికశాతం స్థిరాస్తులు ఉన్న ప్రదేశం యొక్క వివరాలు	అందుబాటులో లేదు
5	ప్రధాన ఉత్పత్తులు/సేవల స్థాపిత సామర్థ్యం	అందుబాటులో లేదు
6	గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించిన ప్రధాన ఉత్పత్తులు/సేవల పరిమాణం మరియు విలువ	గత ఆర్థిక నివేదిక FY 2024-2025 ప్రకారం- శూన్యం
7	ఉద్యోగులు/ కార్మికుల సంఖ్య	అందుబాటులో లేదు
8	గత రెండు సంవత్సరాల చివరిగా అందుబాటులో ఉన్న ఆర్థిక నివేదికలు (షెడ్యూళ్లతో సహా), రుణదాతల జాబితాలతో సహా మరిన్ని వివరాలు	మరిన్ని వివరాలు bfpl.cirp26@gmail.com అనే ఈ-మెయిల్‌లోని వివరణాత్మక EOIలో అందుబాటులో ఉన్నాయి.
9	కోడ్ యొక్క సెక్షన్ 25(2)(H) కింద తీర్మాన దరఖాస్తుదారుల అర్హత ఈ URLలో అందుబాటులో ఉంది: WWW.TRUEIPE.COM	మరిన్ని వివరాలు bfpl.cirp26@gmail.com అనే ఈ-మెయిల్‌లోని వివరణాత్మక EOIలో అందుబాటులో ఉన్నాయి.
10.	ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు చివరి తేదీ	అసలు - 12 సెప్టెంబర్ 2026 సవరించినది - 9 నవంబర్ 2026
11.	సంభావ్య తీర్మాన దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేదీ	అసలు 16 సెప్టెంబర్ 2026 సవరించినది - 13 నవంబర్ 2026
12.	తాత్కాలిక జాబితాకు అభ్యంతరాలు సమర్పించడానికి చివరి తేదీ	అసలు - 21 సెప్టెంబర్ 2026 సవరించినది - 18 నవంబర్ 2026
13.	సంభావ్య తీర్మాన దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేదీ	అసలు - 25 సెప్టెంబర్ 2026 సవరించినది - 21 నవంబర్ 2026
14.	సంభావ్య పరిష్కార దరఖాస్తుదారులకు సమాచార మెమోరాండం, మూల్యాంకన మ్యాట్రిక్స్ మరియు పరిష్కార ప్రణాళికల కోసం అభ్యర్థనను జారీ చేసిన తేదీ	అసలు - 30 సెప్టెంబర్ 2026 సవరించినది - 26 నవంబర్ 2026
15.	తీర్మాన ప్రణాళికలను సమర్పించడానికి చివరి తేదీ	అసలు - 30 అక్టోబర్ 2026 సవరించినది - 26 డిసెంబర్ 2026
16.	ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించడానికి ఈ ఇమెయిల్ ఐడిని నమోదు చేయండి	bfpl.cirp26@gmail.com
17.	MSMEగా కార్పొరేట్ రుణగ్రహీత యొక్క రిజిస్ట్రేషన్ స్థితి వివరాలు)	వర్తించదు

ఐపి మైలవరపు సుజాత
మెస్సర్స్. బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్
వారి రిజల్యూషన్ ప్రొఫెషనల్
రిజిస్ట్రేషన్ నెం. IBBI/IPA-003/00434/2023-2024/14286

తేదీ: 25.10.2026
స్థలం: విశాఖపట్నం

దక్షిణ రైల్వే

చెన్నై డివిజన్‌లోని SG-3 మరియు NSG-6 కేటగిరీ స్టేషన్ల కోసం స్టేషన్ టికెట్ బుకింగ్ ఏజెంట్ (STBA) నియామకానికి ఓపెన్ టెండర్ ఆహ్వానించబడింది.

1	పని పేరు మరియు దాని స్థానం	చెన్నై డివిజన్ పరిధిలోని SG-3 & NSG-6 కేటగిరీ స్టేషన్లకు స్టేషన్ టికెట్ బుకింగ్ ఏజెంట్ నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము.
2	టెండర్ ఫారం ఖర్చు	రూ.1,120/-
3	ఎర్నెస్ట్ మనీ జమ చేయబడుతుంది	
	SG-3 కేటగిరీ స్టేషన్ కోసం	రూ.5,000/- (పట్టాబీరామ్ ఇ-డిపో మరియు పట్టాబీరామ్ మిలిటరీ సైడింగ్ స్టేషన్ల కోసం)
	NSG-6 కేటగిరీ స్టేషన్ కోసం	రూ.2,000/- (తిరువలం, తలంగై, ఒలకూరు, ఒట్టివాక్కం, నగరి, పూడి, పొన్‌పాడి, దొరవారి చత్రం, పోలిరెడ్డిపాలెం, పెదపరియా & ఒడూరు స్టేషన్లకు)
4	ఒప్పంద కాలం	
	SG-3 కేటగిరీ స్టేషన్ కోసం	1 సంవత్సరం
	NSG-6 కేటగిరీ స్టేషన్ కోసం	3 సంవత్సరాలు
5	టెండర్ సమర్పించవలసిన తేదీ మరియు సమయం.	20.11.2026 మధ్యాహ్నం 2 గంటల వరకు
6	టెండర్ తెరవడం	20.11.2026 న 14.30 గంటలకు
7	వెబ్‌సైట్ వివరాలు	www.sr.indianrailways.gov.in

ఈ నియామకం పూర్తిగా ఒప్పంద స్వభావం కలది మరియు రైల్వే సర్వీసులో విలీనం, సర్వీసు క్రమబద్ధీకరణ, బోనస్, రైల్వే పాస్ సౌకర్యాలు మొదలైన ఏ సౌకర్యాలు STBAకు లభించవు. దరఖాస్తులు స్వీకరించే తేదీని సెలవు దినంగా ప్రకటించినట్లయితే, దరఖాస్తులను స్వీకరించే తేదీ తదుపరి పని దినం అవుతుంది.

భారత యూనియన్ అధ్యక్షుని తరపున మరియు వారి తరపున,
డివిజనల్ రైల్వే మేనేజర్, కమర్షియల్, చెన్నై డివిజన్, సదరన్ రైల్వే.